క్లుప్తంగా

ఘనంగా బీరన్న పట్నాలు



బీరన్న పట్నాల్లో పాల్గొన్న మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో కుర్మ కులస్తుల ఆరాధ్య దైవం బీరన్న-కమరాతి పట్నాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రమేశ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

'బండి'ని కలిసిన పెద్దపల్లి నేతలు



ఎంపీ సంజయ్‌తో పెద్దపల్లి నాయకులు

పెద్దపల్లిరూరల్: కరీంనగర్ ఎంపీగా వరుసగా రెండోసారి భారీ మెజార్టీగా ఎన్నికైన బండి సంజయ్‌కుమార్‌ను పెద్దపల్లి నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంజయ్‌ను కలిసిన వారిలో రాష్ట్రీయ హిందూ పరిషత్ గోరక్షక్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేశ్, నాయకులు వేల్పుల రమేశ్ ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో మాజీ జెడ్పీటీసీ మల్లేశం

సుల్తానాబాద్: క్రీడల్లో ఉన్న మెలకువలు బయటకు తీసేందుకు కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని మాజీ జెడ్పీటీసీ గుర్రాల మల్లేశం అన్నారు. పట్టణంలోని శాస్త్రినగర్‌లో బుధవారం బండి సుమన్‌గౌడ్ స్మారక డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. 32 జట్లు పాల్గొనగా10 రోజులపాటు పోటీలు నిర్వహించనున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, సాయిరి మహేందర్, కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, నిర్వాహకులు బండి లచ్చయ్య, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం బస్టాప్ వద్ద డీఎంఎఫ్‌టీ నిధులతో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతున్నారు. డ్రెయినేజీ పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయింది. ప్రజలు డ్రెయినేజీ సమస్యను ఇటీవల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా డ్రెయినేజీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డీఎంఎఫ్‌టీ నిధులతో రెండు ప్రాంతాల్లో సుమారు 600 మీటర్ల డ్రెయినేజీ నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

బోరు మోటార్‌కు మరమ్మతు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పిల్లిపల్లెలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసే బోరు మోటార్‌కు బుధవారం మరమ్మతు చేసి తాగు నీటిని సరఫరా చేశారు. సాక్షి దినపత్రికలో 'కాలిన బోరు మోటార్' అనే కథనం ప్రచురితం కాగా స్పందించిన గ్రామపంచాయతీ అధికారులు బోరు మోటార్‌కు మరమ్మతు చేయించారు. దీంతో పల్లె వాసులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

కార్మిక సమస్యల పరిష్కారానికి పాటుపడాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంపీగా గెలుపొందిన గడ్డం వంశీకృష్ణ కృషి చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. సింగరేణిలో నూతన గనులు, ఉపాధికల్పన, ఇన్‌కమ్‌ట్యాక్స్ మాఫీ, సొంతింటి పథకం అమలు తదతర అంశాలపై దృష్టి సారించాలన్నారు. కార్మిక వర్గం వెన్నంటి ఉండి సమస్యల పరిష్కారంలో ఎంపీ చొరవ చూపాలని నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి కోరారు. ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన గడ్డం వంశీకృష్ణకు అభినందనలు తెలిపారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టుపైనే ఆశలు

కాళేశ్వరం ఎత్తిపోతలపై అస్పష్టత..

రామగుండం: రాబోయే ఖరీఫ్ సీజన్‌తో పాటు ఇతరత్రా పారిశ్రామిక, తాగు, సాగునీటి అవసరాలకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టోరేజీ నీటిపైనే ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టు ఏడో బ్లాక్‌లో కుంగిపోయిన పిల్లర్ల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో నీటి నిల్వలు లేకుండా ఉండేందుకు ప్రాజెక్టు గేట్లన్నీ ఎత్తి ఉంచారు. ఫలితంగా పునరుద్ధరణ పనులు పూర్తి చేసుకొని ఎన్‌డీఎస్‌ఏ ప్రతినిధులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించిన మీదట నీటిని నిల్వ చేసే అవకాశాలు లేకపోలేదు. భారీ వర్షాల మూలంగా పార్వతీ బ్యారేజీ గేట్లు మూసి ఉంచితే అందులో 8 టీఎంసీలు నీటిని నిల్వ చేసుకుని అత్యవసరాల నిమిత్తం పార్వతీ పంపుహౌస్ నుంచి ఎత్తిపోతలతో ఎల్లంపల్లిని నింపుకునే అవకాశం ఉంటుందని అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

ప్రాజెక్టు కేటాయింపులను పరిశీలిస్తే..

- ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విద్యుత్ అవసరాల దృష్ట్యా ఎన్టీపీసీకి 6.5 టీఎంసీల నీటి సరఫరా..
- రెండు టీఎంసీలు మంథనికి ఎత్తిపోతల పథకం ద్వారా కమాన్‌పూర్, మంథని నియోజకవర్గ పరిధిలో 20వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు.
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ భాగంలో కడెం ఎత్తిపోతల పథకం కింద మూడు టీఎంసీలు.
- కరీంనగర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 19 మండలాలకు రెండు లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు. ఇందుకు గాను వేంనూర్‌లో 12 టీఎంసీలను పంపింగ్ చేసేందుకు పంపు హౌస్ నిర్మాణం.
- ప్రాణహిత-చేవెళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం 20 టీఎంసీలు.
- బ్రాహ్మణపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా రామగుండం నియోజకవర్గ పరిధిలో 20వేల ఆయకట్టు అవసరాలకు రెండు టీఎంసీలు.
- అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకంలో భాగంగా 10 టీఎంసీల నీటిని గ్రేటర్ హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం పైపులైన్ల ద్వారా సరఫరా..
- రామగుండం టీఎస్ జెన్‌కో విద్యుత్ కేంద్రానికి 1.89 టీఎంసీలు.
- ఎన్టీపీసీ (స్టేజ్-1లో 1600 మెగావాట్లు) విద్యుత్ కేంద్రానికి రెండు టీఎంసీలు.
- ఎన్టీపీసీ (స్టేజ్-2లో 2400 మెగావాట్లు) విద్యుత్ కేంద్రానికి 2.73 టీఎంసీలు.
- రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ పారిశ్రామిక అవసరాలకు 0.550 టీఎంసీలు.
- ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని సింగరేణి కార్మిక క్వార్టర్లలో తాగు నీటి అవసరాలకు 1.75 టీఎంసీలు.
- రామగుండం కార్పొరేషన్ తాగునీటి అవసరాలకు ఒక టీఎంసీ.
- మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి మున్సిపాలిటీలలో తాగునీటి అవసరాలకు ఒక టీఎంసీ.
- మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేసే నీరు 2.82 టీఎంసీలు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు శంకుస్థాపన..

- శ్రీపాద(ఎల్లంపల్లి) ప్రాజెక్టును జలయజ్ఞంలో భాగంగా జూలై 28, 2004లో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. మూడేళ్ల వ్యవధిలోనే పూర్తి చేయాలనుకున్నా దశాబ్దకాలం పూర్తయ్యాక నీటి నిల్వ చేసుకునే అవకాశం కలిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సైతం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఎల్లంపల్లి కీలకంగా మారింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు 20.175 టీఎంసీల సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రాజెక్టు నుంచి అదనంగా మరో 50 టీఎంసీల నీటిని వివిధ ప్రాంతాలకు కేటాయించారు. మొత్తంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా గరిష్టంగా 60 టీఎంసీల నీటిని వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు.

ఎత్తిపోతల పథకాలకు నీటి కేటాయింపులు..

- తిమ్మాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు 0.080 టీఎంసీలు.
- రాయపట్నం ఎల్ఐఎస్ 0.04356 టీఎంసీలు.
- ముత్తునూర్ ఎల్ఐఎస్ 0.0835 టీఎంసీలు.

నూతనంగా ధర్మపురి మండల పరిధిలోని ఎల్ఐఎస్‌కు ఎల్లంపల్లి నుంచి కేటాయింపులు

- వెల్గటూర్ ఎల్ఐఎస్‌కు 0.0637 టీఎంసీలు.
- స్తంభంపల్లి ఎల్ఐఎస్‌కు 0.130 టీఎంసీలు.
- ధామన్నపేట 0.056 టీఎంసీలు.

ఇరిగేషన్ ఇయర్‌లో ఎల్లంపల్లిలోకి ఔట్‌ఫ్లో.. ఇన్‌ఫ్లో వివరాలు..

2023 జూన్ ఒకటో తేదీ నుంచి 2024 మే 31 వరకు ప్రాజెక్టులోకి వచ్చిన వరద వివరాలు..

- ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి గడిచిన ఏడాదిలో ఇన్‌ఫ్లో 397.15 టీఎంసీలు.
- పార్వతీ పంపుహౌస్ నుంచి ఎల్లంపల్లిలోకి ఎత్తిపోతలు 7.54 టీఎంసీలు.
- ఎస్సారెస్పీ, కడెం, క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి ప్రాజెక్టులోకి వచ్చిన వరద నీరు 389.60 టీఎంసీలు.
- ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది పంపుహౌస్‌కు ఎత్తిపోతలతో ఔట్‌ఫ్లో 9.76 టీఎంసీలు.
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద చేరిన సమయంలో గేట్లు ఎత్తి 371.65 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రామగుండం కమిషనర్ సీ.హెచ్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి గోదావరిఖని గాంధీచౌక్ చౌరస్తా వరకు గ్రీన్‌ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రామగుండం ప్రాంతీయ కార్యాలయం ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ భిక్షపతి మాట్లాడుతూ 'నేల పునరుద్ధరణ.. ఎడారీకరణ, కరువును తట్టుకోవడం' అనే థీమ్‌తో ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2024 పర్యావరణ దినోత్సవం థీమ్‌తో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ హితంగా తయారు చేసిన జనపనార సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. సింగరేణి పర్యావరణ విభాగం అధికారులు సురేశ్‌బాబు, రాజిరెడ్డి, కిషోర్, ఎన్టీపీసీ అధికారి విశాల్, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు సత్యనారాయణ, క్రిష్ణిందు, చింకు రామినీ, దీపక్ శామ్యూల్, జీపీపీపీజీ అధ్యక్షులు భీమ్‌సేన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: మండలంలోని కటికెనపల్లికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి నరేశ్ ఆదివారం హత్యకు గురైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వెల్గటూర్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, రూప్లానాయక్, నర్సింహులు, దేవేందర్‌రెడ్డి, లింగయ్య ఉన్నారు.

ఆవిష్కృత్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి: జూన్ 11, 12వ తేదీల్లో సెంటనరీకాలనీ జేఎన్టీయూ కళాశాలలో నిర్వహించనున్న ఆవిష్కృత్ 2024 పోస్టర్‌ను బుధవారం ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రతి ఏటా రెండు రోజుల పాటు టెక్నికల్, నాన్ టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించన్నామని తెలిపారు. టెక్నికల్‌లో భాగంగా మోడల్ మేకింగ్, పిపిటి, డ్రోన్ అసెంబ్లింగ్, సర్వేయింగ్, కాంక్రీట్ డిజైన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, స్క్రంబుల్డ్ కోడ్, కోడ్ కింగ్, రిలే కోడ్, మేజ సిల్వర్, టెక్ టానింగ్ మేమ్స్, సబ్‌స్టేషన్ ఎక్స్‌పో, ఎక్స్‌ప్లోరింగ్, క్విజ్, మైన్ ఎక్స్‌పెరియా, జియో ఓరియల్, ప్రహేలిక, ఫ్రాష్‌నోటర్ లాంటివి ఉంటాయన్నారు. నాన్ టెక్నికల్‌లో టగ్ ఆఫ్ వార్, సాంగ్ డెడికేషన్, స్టాండ్ అవుట్, షూటింగ్ మానియా, ఫిష్ స్పా, ఎస్కేప్ రూం, స్నేక్ అండ్ లాడర్, రోజ్ డెడికేషన్ లాంటివి ఉన్నాయని పేర్కొన్నారు. చివరిరోజున సాంస్కృతిక కార్యక్రమాలైన మ్యూజిక్ పర్ఫామెన్స్, ఫ్లాష్‌మాబ్, డ్యాన్స్‌లు, డ్రామా, పోయెట్రీ ఉంటాయన్నారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా ఈఈఈ విభాగ అధిపతి ఆర్.దుర్గారావ్ వ్యవహరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ ఎ.మేఘన, పి.విశిష్ట, ఎస్.సింధురెడ్డి, ఎస్.మానస, జి.కౌశిక్, ఎం.చైతన్య పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కాపరి, నాలుగు గేదెలు మృతి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల (మారుతినగర్)కు చెందిన నూనె కనకయ్య(55) అనే గేదెల కాపరితో పాటు నాలుగు గేదెలు బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. ఎస్సై శ్రావణ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కనకయ్యకు తన గేదెలను కనుకుల శివారులోని చేలుమేకుంట ప్రాంతంలో మేపుతుండగా మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ తీగలు కింద పడ్డాయి. బుధవారం తీగలు తాకడంతో కాపరితో పాటు నాలుగు గేదెలు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. సాయంత్రం అయినా కనకయ్య ఇంటికి రాకపోవడంతో శివారులో కుటుంబసభ్యులు వెతకగా విద్యుత్ షాక్ తగిలి విగత జీవిగా పడి ఉండటంతో వెంటనే పోలీసుకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కొడుకు ఉన్నాడు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సతీమణి పరామర్శ

రామగుండం: కార్పొరేషన్ ఒకటో డివిజన్ పట్టణ పరిధిలోని ఆదర్శనగర్‌లో ఇటీవల భారీ ఈదురు గాలుల బీభత్సవానికి ఇంటి పైకప్పులు కొట్టుకుపోయిన బాధిత కుటుంబాన్ని బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలిఠాకూర్ పరామర్శించారు. నిరుపేద కుటుంబమైన బట్టారి మనమ్మ-లక్ష్మిపతి దంపతుల ఇంటి పైకప్పు పూర్తిగా కొట్టుకుపోయి పక్కకు పడిపోవడంతో రేకులు పూర్తిగా పగిలిపోవడంతో ఇంట్లోని నిత్యావసరాలు తడిసి ముద్దయ్యాయి. విద్యుత్ స్తంభం వంగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై ఎమ్మెల్యే సతీమణి సీరియస్‌గా స్పందిస్తూ సంబంధిత ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్, ఫిషరీస్ చైర్మన్ పల్లికొండ రాజేష్, మహ్మద్ ఉస్మాన్ షరీఫ్, ప్రేమ్‌కుమార్, సాదు రమేష్, బట్టారి ప్రణయ్, మేడి రాజయ్య, ఉమర్, బింగి వంశీ, నరేష్, అహ్మద్ తదితరులున్నారు.

మొక్కలు నాటుదాం.. కాలుష్యాన్ని నివారిద్దాం



గోదావరిఖని: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



రామగిరి: ఏపీఏ గనిలో..



పెద్దపల్లిరూరల్: మొక్కలు నాటుతున్న కమిషనర్

గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా మొక్కలను పంచిపెట్టారు.

కోల్‌సిటీ: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి కాలుష్యం లేని పర్యావరణాన్ని నిర్మించడానికి ముందుకు రావాలని గోదావరిఖనిలోని ప్రభుత్వ సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం మెడికల్ కాలేజీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. హెడ్‌వోడీలు, ప్రొఫెసర్లు, మెడికోలతో కలిసి ప్రిన్సిపాల్ మొక్కలు నాటి నీళ్లు పోశారు.

రామగుండం: పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం అంతర్గాం ఎంపీడీవో ఎం ఏ.అలీం ఉపాధిహామీ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల వివిధ విభాగాల అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. గోలివాడ గ్రామంలోని వననర్సరీని సందర్శించి మొక్కలు నాటారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో మున్సిపల్ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ బుధవారం మొక్కలు నాటారు. మొక్కలు నాటి రక్షిస్తామని మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

రామగిరి: ఏపీఏ గని ఆవరణలో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

రామగిరి: అందరం మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. ఆర్జీ-3 ఏరియాలలోని గనులలో, జీఎం కార్యాలయంలో మొక్కలు నాటారు.

జూలపల్లి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి మొక్కలు నాటారు. మండలంలోని అబ్బాపూర్, చీమలపేట, కుమ్మరికుంట గ్రామాల్లో మొక్కలు నాటారు.

జ్యోతినగర్: ఐసీడీఎస్ ప్రాజెక్టు రామగుండం అర్బన్ సీడీపీవో స్వరూపరాణి, సూపర్‌వైజర్ పుష్పలత సూచన మేరకు బుధవారం ఎన్టీపీసీ, జ్యోతినగర్, పీటీఎస్‌లోని డి-టైప్ క్వార్టర్స్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు.



రామగిరి: మొక్క నాటుతున్న ఆర్జీ-3 జీఎం

సుల్తానాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు సుచరిత అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక సెక్రెడ్ హార్ట్ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలు నాటారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఓసీపీ-1 బేస్ వర్క్‌షాప్‌లో బుధవారం నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సులో ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-1 పర్యావరణ అధికారి కిషన్ మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామానికి చెందిన కానుగంటి లక్ష్మిపతి(27)అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పొత్కపల్లి ఏఎస్సై సుధాకర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఓదెల గ్రామానికి చెందిన లక్ష్మిపతికి పరకాలకు చెందిన స్రవంతితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడంతో జీవితంపై విరక్తిచెందిన లక్ష్మిపతి మంగళవారం మధ్యాహ్నం గడ్డిమందు తాగాడు. చికిత్స కోసం కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బీజేపీకి ఓటేసిన వారందరికీ రుణపడి ఉంటాం

కాల్వశ్రీరాంపూర్: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మాదిగ సామాజిక వర్గంతోపాటు ఉపకులాలు ఇతర కులాలు బీజేపీకి ఓటేసిన వారందరికీ ఎమ్మార్పీఎస్ పక్షాన రుణపడి ఉంటామని జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొండ్ర వివేక్, కనుకుంట్ల ఆకాశ్, లింగమూర్తి, సాగర్, రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

ముత్తారంలో కాంగ్రెస్ సంబరాలు

ముత్తారం: పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ గెలుపొందడంపై ముత్తారంలో బుధవారం కాంగ్రెస్ మండల శ్రేణులు సంబరాలు జరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు స్థానిక కార్యకర్తలు సమష్టిగా పని చేయడంతోనే మంథని నియోజకవర్గం నుంచి 53వేల మెజార్టీ వచ్చిందన్నారు. మహిళా మండల అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్, జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, నాయకులు బియ్యని శివ, గోస్కుల రమేశ్, చెలుకల జితేందర్, మల్యాల రాజయ్య, తాటిపాముల శంకర్, పర్శ శ్రీను, గాదం శ్రీను, తీగల సత్యనారాయణరావు ఉన్నారు.

టెన్త్ హిందీ పరీక్షకు ఒకే ఒక్కడు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు ఒక్క విద్యార్థి హాజరయ్యాడు. 14మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 13మంది గైర్హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు.

బేటీ బచావో.. బేటీ పడావో

రామగిరి: లింగ వివక్ష, మహిళా సాధికారత గురించి ఆందోళన, పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని ప్రవేశపెట్టిందని మహిళా సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ చంద్రు స్వప్న అన్నారు. మండలంలోని నాగెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళా సాధికారత ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు.

కౌన్సిలర్‌కు నివాళి



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్, బీజేపీ నాయకుడు కొంతం శ్రీనివాసరెడ్డి సంతాపసభ బుధవారం పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని రెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, గుజ్జుల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, కమిషనర్ వెంకటేశ్, సిబ్బంది నివాళి అర్పించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



వాహనం, నిందితులను చూపుతున్న అధికారులు

ముత్తారం(మంథని): జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి ముత్తారం మండలం మీదుగా పెద్దపల్లికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, వాహనాన్ని సివిల్ సప్లయ్ అధికారులు బుధవారం పట్టుకున్నారని ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాసింపల్లికి చెందిన దుగ్యాల సమ్మయ్య వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మోత్కులగూడేనికి చెందిన అంబాల అనిల్ వాహనంలో 100 క్వింటాళ్ల రేషన్ బియ్యన్ని పెద్దపల్లికి చెందిన అంజనేయులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్‌కు చెందిన రాజుకు అప్పగించేందుకు తరలిస్తుండగా సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు వాహనం, బియ్యం సీజ్ చేసి దుగ్యాల సమ్మయ్య, అంబాల అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆశ్రమ వృద్ధురాలికి ఉచిత కంటి ఆపరేషన్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో ఉంటున్న చల్ల లచ్చవ్వ అనే వృద్ధురాలికి బుధవారం స్థానిక లక్ష్మీనగర్‌లోని దుర్గాప్రసాద్ నేత్రాలయ కేంద్రానికి చెందిన కంటి వైద్య నిపుణుడు దుర్గాప్రసాద్ ఉచితంగా కంటి ఆపరేషన్ చేశారు. వృద్ధాశ్రమంలో మరో నలుగురు వృద్ధులు కూడా కంటి చూపు సమస్యతో బాధపడుతున్నారని, వీరందరికీ కూడా దశలవారీగా తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఉచిత శస్త్ర చికిత్స చేయడానికి ముందుకు వచ్చిన డాక్టర్‌ను, ఆశ్రమ నిర్వాహకులు పీ.టీ.స్వామి, గంట సత్తయ అభినందించారు. మెడికల్ షాపు నిర్వాహకులు కరుణాకర్‌రెడ్డి, మహ్మద్ సర్వర్ పాల్గొన్నారు.

ఇల్లు కూలిన వారికి పరిహారం చెల్లించాలి

ఓదెల: మండలంలో కురిసిన వర్షాలకు కూలిన ఇళ్లకు పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి కోరారు. మండలంలోని గుండ్లపల్లె గ్రామంలో ఈదురుగాలుల వర్షానికి వేల్పుల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శంకర్‌రెడ్డిల ఇళ్లు కూలిపోగా బుధవారం ఆయన పరిశీలించారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే కూలిన ఇళ్లను పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు పంపాలన్నారు. గుండ్లపల్లె మాజీ సర్పంచ్ శంకర్ ఉన్నారు.

పెద్దపల్లి ఎంపీ వంశీకి శుభాకాంక్షలు



వంశీతో పెద్దంపేట గ్రామ యువకులు

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను బుధవారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ యువత చెన్నూర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన గ్రామాన్ని సందర్శించాలని కోరారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం మధు, మగ్గిడి దీపక్, భీమ్ సందేష్, శివప్రసాద్, ప్రభాకర్ ఉన్నారు.